క్లుప్తంగా

వైభవంగా రుద్రాభిషేకం



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల : ఉండ్రుగొండ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామికి శనివారం చైత్రమాస శివరాత్రి సందర్భంగా మహన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ మనోహర శర్మ మంత్రోచ్ఛరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చకిలం క్రిష్ణకుమార్, బందకవి క్రిష్ణమోహన్, మధుసూదన్‌రావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు ఎంపికైన యువకుడికి సన్మానం



వేణును సన్మానిస్తున్న యూత్ క్లబ్ సభ్యులు

నూతనకల్ : వెంకెపల్లి గ్రామానికి చెందిన దూదిగామ వేణు అగ్నివీర్‌కు ఎంపికైన సందర్భంగా భగత్‌సింగ్ యూత్ క్లబ్ సభ్యులు శనివారం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ క్లబ్ అధ్యక్షుడు తూడి విజయ్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నరమేధం ఆపాలి

సూర్యాపేట అర్బన్ : ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులోని కర్రెగుట్ట ప్రాంతంలో కొనసాగుతున్న నరమేధాన్ని ఆపాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 27, 28 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా నిరసనలు పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

200 గడ్డి కట్టలు దగ్ధం

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన కుంకుడుపాల రవీందర్ అనే రైతు వ్యవసాయ భూమిలో 5ఎకరాల పొలానికి సంబంధించిన సుమారు 200 కట్టల గడ్డిని శనివారం గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. అయితే ఈ విషయమై బాధిత రైతు రవీందర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ గడ్డి సుమారు రూ. 10 వేల విలువ చేస్తుందని చెప్పారు. గడ్డిని దహనం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

చెక్‌డ్యాం పరిశీలన



అర్వపల్లి శివారులో గుట్ట వద్ద నిర్మించిన చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న అధికారులు

అర్వపల్లి : చెక్‌డ్యాంల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరగనున్నాయని ఉపాధిహామీ పథకం ఏపీఓ సీహెచ్.ఉపేందర్ అన్నారు. అర్వపల్లి శివారులో కంచగట్టుగుట్ట సమీపాన ఉపాధిహామీ పథకం నిధులు రూ.5లక్షలతో నిర్మించిన చెక్‌డ్యాంను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉపాధిపథకంలో రైతులకు సంబంధించి అనేక ప్రయోజనాలు సమకూరుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈసీ నగేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

అర్వపల్లి : మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొదలైంది. లోయపల్లిలో శనివారం ఎంపీడీఓ టి.గోపి ఇంటింటి సర్వే జరిపారు. గ్రామానికి 9 ఇళ్లు మంజూరు కాగా అర్హులను ఎంపిక చేయడం కోసం సర్వే చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

30 వరకు ఫీజు చెల్లించాలి

ఆత్మకూర్(ఎస్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజును ఈ నెల 30లోగా చెల్లించాలని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. విద్యార్థులు కళాశాల పరీక్ష విభాగంలో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

అర్వపల్లి: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మండల నోడల్ అధికారి కుంభం ప్రభాకర్ అన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి గానూ ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా అయిన క్లాత్‌ను శనివారం ఎమ్మార్సీలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు.



క్లాత్ పంపిణీ చేస్తున్న ఎంఎన్‌ఓ ప్రభాకర్

పూడిక తీయక.. మురుగు పారక

- సూర్యాపేట పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ
- మురుగు నీరు సాఫీగా వెళ్లక ఇబ్బందులు పడుతున్న స్థానికులు



మురుగుకాలువలో వేసిన చెట్లకొమ్మలు



కాలువలోకి చేరుతున్న మట్టి

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని శ్రీనగర్ కాలనీ రోడ్ నంబర్ వన్‌లో కాలువ పూడిక తీయకపోవడంతో చెత్తపేరుకుపోయింది. దీంతో కాలువలో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాకుండా దోమలు వ్యాప్తి చెంది స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువ పక్కనే ఇళ్ల నిర్మాణం చేపడుతున్న వారు మట్టిఎత్తిపోస్తున్న క్రమంలో ఆ మట్టి కొంతవరకు కాలువలోకి జారిపడుతోంది. దీంతో కాలువ పూడిపోయి మురుగునీరు నిలుస్తోంది. పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం క్రాస్ రోడ్డు ప్రాంతంలోని నివాసాలు, హోటళ్లలో అవసరాలకు వినియోగించగా వెలువడే మురుగు నీరు సరాసరి శ్రీనగర్ కాలనీ రోడ్ నంబర్ వన్‌లో గల కాలువలోకి చేరుతోంది. ఈ కాలువకు మట్టి అడ్డుగా ఉండటంతో వ్యర్థ పదార్థాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. కాలనీవాసులు అటుగా వెళ్లాలంటేనే ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి కాలువ పూడిక తీయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాలువ పూడిక తీయిస్తామని తెలిపారు.

దుర్గంధం భరించలేకపోతున్నాం



కాలువల్లో కొట్టుకొచ్చే వ్యర్థాలకు తోడు, స్థానికుల నిర్లక్ష్య ధోరణి కారణంగా డ్రెయినేజీలు అధ్వానంగా మారాయి. స్థానికులు వ్యర్థాలను కాలువలో వేయొద్దు. మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని కాలువను శుభ్రం చేయించాలి.

– పిట్టా రాజశేఖరరెడ్డి, స్థానికుడు

ప్రజల ఇబ్బంది పట్టించుకోరా..

- మెట్రో హాస్పిటల్ సమీపం నుంచి రోడ్లపైకి చేరుతున్న మురుగు నీరు
- దుర్వాసనతో స్థానికుల ఆందోళన

తాళ్లగడ్డ (సూర్యాపేట): పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలోని మెట్రో హాస్పిటల్ ఎదుట నుంచి డ్రెయినేజీ నీరు రోడ్లపైకి వస్తోంది. మురుగు నీరంతా రహదారి వెంబడి, వీధుల వెంట ప్రవహిస్తోంది. వీధుల వెంట దుర్గంధం వస్తుండటంతో కాలనీవాసులు ఇళ్లనుంచి బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. దుర్వాసన ఇళ్లలోకి కూడా వ్యాపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



మెట్రో హాస్పిటల్ ఎదుట డ్రెయినేజీ నీటిని రోడ్డుపైకి వదిలేందుకు ఏర్పాటు చేసిన పైపు



వీధుల వెంట ప్రవహిస్తున్న మురుగు నీరు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెన్‌పహాడ్ : 11కేవీ విద్యుత్ తీగల మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాస్ శనివారం తెలిపారు. పెన్‌పహాడ్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న పెన్‌పహాడ్, మాచారం ఫీడర్, చీదెళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో చీదెళ్ల ఫీడర్ కింద ఉన్న గ్రామాలకు ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పశు వైద్యశిబిరం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో శుక్రవారం పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. రైతులు తమ పశువులకు ఉచితంగా టీకాలను వేయించుకోవాలని కోరారు. అలాగే ఇతర గ్రామాల్లో కూడా వైద్యశిబిరాలను జరిపారు. ఈ కార్యక్రమంలో జాజిరెడ్డిగూడెం మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్, వీఎల్ఓ కేఎస్ఎస్.పద్మ, గోపాలమిత్రలు లింగయ్య, అర్జున్, సురేందర్, యాకయ్య, ఓఎస్ మధుసూదన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



సూర్యాపేటటౌన్ : మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

సూర్యాపేటటౌన్ : వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని 26వ వార్డులో బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రేపల్లె ఉపేందర్, రేపల్లె రాజా, వట్టే లింగరాజు, లతీఫ్, వెంకటేష్, నరాల నాగరాజు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు కందుకూరి ప్రవీణ్ కోరారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బూటకపు వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని తుంగలో తొక్కారని, రాష్ట్ర ప్రజలు మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. బహిరంగ సభకు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగపాక రవి, ఉదయ్, రంజిత్, భాస్కర్, రాకేష్, శ్రీకాంత్, రమేష్, నవీన్, అనిల్ పాల్గొన్నారు.

అర్వపల్లి : వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ కోరారు. మండల పరిధిలోని ఉయ్యాలవాడ, సూర్యానాయక్‌తండా, కొత్తగూడెం, బొల్లంపల్లి గ్రామాల్లో శనివారం సభ విజయవంతానికై సన్నాహక సమావేశం నిర్వహించారు. సభకు మాజీ ఎమ్మెల్యే కిషోర్ నాయకత్వంలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. అలాగే కుంచమర్తి గ్రామంలో సభ పోస్టర్లను బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మన్నె లక్ష్మీనర్సయ్యయాదవ్ ఆవిష్కరించారు. సమావేశంలో దుబ్బాక ఎల్లంరాజు, జానయ్య, నాగరాజు, వెంకట్, బిక్కునాయక్, సంజీవనాయక్, గుండె ఈశ్వర్, గోసుల విజయ్, వీరన్న, రవీందర్, పిట్టల నర్సయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలం నుంచి వేలాదిగా తరలిరావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తునికి సాయిలు, గునిగంటి యాదగిరి, క్రాంతి, కళ్యాణ్, రాంలాల్, గోపగాని వెంకన్న పాల్గొన్నారు.



తిరుమలగిరి : మాట్లాడుతున్న నాయకులు



అర్వపల్లి : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నత్తనడకన కొనుగోళ్లు.. రైతులకు తిప్పలు

- కాంటాల్లో జాప్యం.. లారీల కొరత

తిరుమలగిరి : రైతులు పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని భారీగా తీసుకువచ్చారు. కానీ కేంద్రాల్లో రోజులు గడిచినా ధాన్యం కాంటాలు కాకపోవడం, మరోవైపు కాంటాలైన ధాన్యాన్ని తరలించేందుకు లారీల కొరత నెలకొనడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

20 కొనుగోలు కేంద్రాలు..

తిరుమలగిరి మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 10, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4, మెప్మా ఆధ్వర్యంలో 3, రైతు సహకార సంఘాల ఆధ్వర్యంలో 3 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఆయా కేంద్రాలు 20 రోజుల క్రితం ప్రారంభమైనా కొనుగోళ్లు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కనీస వసతులు కరువు..

కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులు కరువయ్యాయి. చాలా చోట్ల నీడ కోసం టెంట్లు కూడా వేయలేదు. దీంతో రైతులు చెట్ల కిందనే సేద తీరాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందించడం లేదు. రైతులే టార్పాలిన్లు అద్దెకు తీసుకొస్తున్నారు. ఒక్కో టార్పాలిన్‌కు రూ.25 వెచ్చించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.



తిరుమలగిరిలోని కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం రాశులు

20 రోజులు అయ్యింది



కొనుగోలు కేంద్రానికి 20 రోజుల క్రితం 400 బస్తాల ధాన్యం తీసుకొచ్చాను. ఇప్పటికే రాళ్ల వానతో 200 బస్తాల ధాన్యం వరిచేనులోనే రాలిపోయింది. మిగిలిన ధాన్యాన్నైనా అమ్ముకుందామంటే కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతున్నాయి. మళ్లీ వర్షం వస్తుందేమోనని భయంగా ఉంది. ధాన్యం కాంటాలు వెంటనే జరిగేలా చూడాలి.

– వర్రే గంగాధర్, తిరుమలగిరి

'భూ భారతి'తో సమస్యలు పరిష్కారం



భూభారతి చట్టం అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

మద్దిరాల : భూ భారతి చట్టంతో గ్రామాల్లో రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అదనపు కలెక్టర్ రాంబాబు, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో భూభారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ముందుగా కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడిలో మరణించిన పర్యటకులకు నివాళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ భూభారతి చట్టంలో తహసీల్దార్ నుంచి సీసీఎల్ఏ స్థాయి వరకు భూ సమస్యలు పరిష్కరించేందుకు వెసులుబాటు కల్పించారని అన్నారు. రైతులు భూ సమస్యలను స్వయంగా దరఖాస్తు చేసుకునేలా పోర్టల్‌ను రూపొందించినట్లు తెలిపారు. అనంతరం చెవిటి వెంకన్న యాదవ్ మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా పేదల భూములకు భద్రత ఏర్పడిందని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవరావు, మండల స్పెషల్ ఆఫీసర్ నాగయ్య, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ మార్గం సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, ఏఓ అనిషారూహి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రతా చర్యలు చేపట్టాలి



నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థి మిత్ర మండలి సభ్యులు

సూర్యాపేట అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రతా చర్యలు చేపట్టాలని సూర్యాపేట పూర్వ విద్యార్థి మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లికార్జున్ అన్నారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రమూకల చేతిలో అమరత్వం పొందిన భారతీయులకు శని వారం సూర్యాపేట పూర్వ విద్యార్థి మిత్ర మండలి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీరాంనగర్ నుంచి పోస్టాఫీసు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లికార్జున్ మాట్లాడారు. ఇటువంటి ఉగ్రదాడులు మరోసారి జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు తన్నీరు యాదగిరి, సట్టు వెంకన్న, వీర్లపాటి వెంకన్న, తల్లాడ రామచంద్రయ్య, చారి, భాష, లక్ష్మమ్మ, హుస్సేని, సాంబశివుడు, శ్రీనివాస్, వీరబోయిన భగవాన్, కన్నా యాదవ్, ధ్రువ కాంత్, రవీంద్ర నాయక్, కురువా నాయక్, గోవింద్ పాల్గొన్నారు.

ఫూలే, అంబేడ్కర్ జన జాతర కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

తాళ్లగడ్డ(సూర్యాపేట) : ఫూలే, అంబేడ్కర్ జన జాతరను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ భవన్‌లో ఫూలే, అంబేడ్కర్ జన జాతర కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. పట్టణంలోని రైతుబజారులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో ప్రజల్లో సామాజిక చైతన్యం కలిగించడం కోసం జన జాతరలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30న నిర్వహించే జన జాతరకు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మచ్చ నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పిండిగ నాగమణి, దేవరకొండ యాదగిరి, టేకుల సుధాకర్, జిల్లా నాయకులు చిన్నపంగి నరసయ్య, నందిపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధమవుదాం

సూర్యాపేట అర్బన్ : మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ధర్మ భిక్షం భవనంలో చామల అశోక్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 139వ మేడే వేడుకలను కార్మికవర్గం ఘనంగా నిర్వహించాలని అన్నారు. కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, రిక్షా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పెండ్ర కృష్ణ, టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్, పున్నం రమేష్, మల్లికార్జున్ రెడ్డి, రవి, టిప్పర్ యూనియన్ అధ్యక్షుడు నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

మేడేను జిల్లా వ్యాప్తంగా వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఎంవీఎన్ భవన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శుల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో తీవ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారికి సంతాపం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, రాజ్యాంగ, ప్రజా వ్యతిరేక విధానాలతో దేశాన్ని తిరోగమన దిశలో పాలిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండా వెంకటరెడ్డి, మేకన బోయిన శేఖర్, వీరబోయిన రవి, కందాల శంకర్ రెడ్డి, పల్లె వెంకట్ రెడ్డి, షేక్ యాకూబ్, దుగ్గి బ్రహ్మం, మిట్టగడుపుల ముత్యాలు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, బెల్లంకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.



సూర్యాపేట అర్బన్ : మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి



నూతనకల్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మేడే పోస్టర్ ఆవిష్కరణ..

నూతనకల్ : మే 1న నిర్వహించే ప్రపంచ మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్రంలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మూరగుండ్ల మధు, మరికంటి సైదులు, నకిరేకంటి శ్రీను, సంజీవ, వెంకన్న, వీరయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



పెన్‌పహాడ్ : అనాజిపురంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ లాలు



తిరుమలగిరి : అనంతారం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



నూతనకల్ : గుండ్లసింగారంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

తిరుమలగిరి : రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని తహసీల్దార్ హరిప్రసాద్ కోరారు. శనివారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా ఆధ్వర్యంలో నడుస్తున్న మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యంలో తేమ శాతం 17లోపు ఉండే విధంగా ఆరబెట్టుకొని తీసుకురావాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని వసతులు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. తూకాలు వేసిన బస్తాలను లారీల ద్వారా వెంట వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

పెన్‌పహాడ్ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ లాలు అన్నారు. శనివారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని అనాజిపురం, అనంతారం, మహ్మదాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధాన్యాన్ని వెంట వెంటనే కాంటాలు వేసి సకాలంలో దిగుమతి అయ్యే విధంగా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అజయ్‌నాయక్, సీఈఓలు ఆలకుంట్ల సైదులు, సోమ్లా, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

నూతనకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కాంటాలను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని యడవెల్లి, గుండ్లసింగారం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కొణతం కర్ణాకర్‌రెడ్డి, నిర్వాహకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు ఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీఓ వేణుమాధవ్‌రావు శనివారం పరిశీలించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్ సింగ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలను వేగవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వద్దాణం కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ముత్తినేని రమేష్, విక్రమచారి, వెంకన్న, శంభయ్య నాయుడు, తులసీదాస్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలు అన్ని రంగాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌గౌడ్

తిరుమలగిరి : తెలంగాణతోపాటు దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలు అన్ని రంగాల్లో ముందుండాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గునగంటి చంద్రశేఖర్ గౌడ్, చుక్కల సత్యనారాయణ తెలిపారు. శనివారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏళ్ల తరబడి బీసీలు అన్ని రంగాలలో అణచివేయబడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య, బీసీ సంఘం జిల్లా నాయకులు చేను శ్రీనివాస్, గిలకత్తుల రాముగౌడ్, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి వంగరి బ్రహ్మం, దేవులపల్లి గణేష్, మెతుకు నరసింహ, పాశం సత్యనారాయణ, చింతకాయల సుధాకర్, లోడె సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ శిబిరం

అర్వపల్లి : క్షయ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ కోరారు. మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో శనివారం క్షయ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మందికి వైద్యపరీక్షలు చేశారు. క్షయ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీబీ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ల్యాబ్ టెక్నీషియన్ చొక్కయ్య, ఎంఎల్‌హెచ్‌పీ వాణి, హెల్త్ అసిస్టెంట్ దుర్గమ్మ, ఆశా కార్యకర్తలు స్వరూప, సుధ, సైదమ్మ, తదితరులు పాల్గొన్నారు.